సాక్షి సంగారెడ్డి

గురువారం । 23 । మే । 2024



మామిడి రకాన్ని చూస్తున్న కలెక్టర్ క్రాంతి

మధుర 'ఫలం'

పండ్లలో రారాజు మామిడి. మార్కెట్లో లభించే కొన్ని రకాలే పండ్లే అందరికీ తెలుసు. కానీ పట్టణంలో ఫల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఏకంగా 250 రకాలకు పైగా ఫల ప్రదర్శన నిర్వహిస్తుంది. కాగా, బుధవారం కూడా ప్రదర్శన కొనసాగగా కలెక్టర్ క్రాంతి సందర్శించారు. భారీ మామిడిని చేతిలో తీసుకొని పరిశీలించారు. కాగా, పండ్ల తోటల పెంపకంపై రైతులు మక్కువ చూపాలని, అధికారులు రైతుల సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే ఆర్థికంగా బలపడతారని కలెక్టర్ క్రాంతి అన్నారు. వివిధ మామిడి రకాల గురించి తెలుసుకొని రైతులతో సంభాషించి వారి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం 15 వేల ఎకరాల వరకు సాగు అవుతుందని వివరించారు. రైతుల సమస్యలు పరిష్కారానికి ఉద్యానవన శాఖ, శాస్త్రవేత్తలు సమన్వయంతో పనిచేసి పరిష్కరించాలని సూచించారు.

- సంగారెడ్డి

ధాన్యం బస్తాలు



ఒక్కరోజే 6 వేల మెట్రిక్ టన్నులు..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని వడ్లు మిల్లులకు తరలుతున్నాయి. బుధవారం ఉదయం సంగారెడ్డి జిల్లాకు లారీలు చేరుకోగా ఈ ఒక్కరోజే 100 లారీల ద్వారా 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు సివిల్ సప్లయి అధికారి వనజాత 'సాక్షి'కి తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇటీవల కలెక్టర్ క్రాంతి .. అందోల్ మండలం కన్సాన్పల్లి, అందోల్‌ల్లో కొనుగోళ్లు కేంద్రాలను సందర్శించి లారీ కాంట్రాక్టర్లతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో తరలింపు ప్రక్రియ వేగవంతమైందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

- వట్‌పల్లి(అందోల్)



లారీల్లో ధాన్యాన్ని నింపుతున్న కూలీలు

న్యూస్‌రీల్

పాలిసెట్‌కు మూడు పరీక్షా కేంద్రాలు

24న ఎగ్జామ్

జహీరాబాద్ టౌన్: పాలిసెట్–2024 ఎంట్రన్స్ పరీక్షను పట్టణంలోని మూడు కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ కుమారస్వామి బుధవారం తెలిపారు. రంజోల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఆర్‌ఎల్‌ఆర్ కళాశాలలో ఈ నెల 24న పరీక్ష జరుగుతుందని, 800 మంది పరీక్షకు హాజరవుతారన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగే ఎగ్జామ్‌కు గంట ముందు కేంద్రానికి రావాలని కోరారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించమని పేర్కొన్నారు.

జొన్న రైతులకు ఇబ్బందులు కలగవద్దు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ఝరాసంగం(జహీరాబాద్): కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆవరణలో ఉన్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు వివరాలు, పలు రకాల రిజిస్టర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు బిల్లులను వెంటనే చెల్లించాలని సూచించారు. తూకంలో ఎలాంటి అవకతవకలు ఉండరాదన్నారు. అనంతరం అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నిసార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

హుండీలో రద్దయిన రూ. 2 వేలు, వెయ్యి నోట్లు



హుండీలోవచ్చిన రద్దయిన నోట్లు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకేతకీ సంగమేశ్వర ఆలయ హుండీ ఆదాయం లెక్కించారు. అందులో అమెరికాకు చెందిన 21 డాలర్లు, దేశంలో రద్దు చేసిన నోట్లు రూ. 2 వేలు, రూ.వెయ్యితోపాటు చెలామణిలో ఉన్న రూ.500లు భక్తులు కానుకలుగా వేశారు. బుధవారం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆలయ అధికారులు, అర్చకుల సమక్షంలో ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. రూ. 26 లక్షల 53 వేల 240లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శశిధర్ వెల్లడించారు. సుమారు అర కిలో వెండి, రెండు తులాల బంగారం వచ్చినట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

సంగారెడ్డి టౌన్: రేపటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్ విద్యాధికారి గోవిందరామ్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మొత్తం 14,886 మంది విద్యార్థులు అడ్వాన్స్ సప్లిమెంటరీకి హాజరవుతున్నారన్నారు. జిల్లా పరిధిలో 31 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 9,318 మంది, ఒకేషనల్ 599, రెండవ సంవత్సరంలో 4,646, ఒకేషనల్ విద్యార్థులు 322 మంది హాజరవుతున్నారన్నారు.ఫస్టియర్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకెండియర్‌కు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సమయం ఉంటుందన్నారు.

నూతన ఒర'బడి'

మహిళా సంఘాలకు సర్కారు బడుల బాధ్యత

మౌలిక సాకర్యాల కల్పనకు పెద్దపీట

సర్కారు బడి అద్భుత ప్రగతి సాధించబోతుంది. మహిళా సాధికారతే లక్ష్యంగా పాఠశాలల్లో మౌలిక సాకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం విద్యాశాఖకు భారీగా నిధులు కేటాయించింది. ఉమ్మడి మెదక్ జిల్లాకు మొత్తం రూ. 82.11 కోట్లు మంజూరు చేయగా..ఇందులో 25 శాతం నిధులు రూ.20.21 కోట్లు సంబంధిత అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అకౌంట్లలో జమ చేసింది. ఈ పథకం కింద సంగారెడ్డి జిల్లాలో 756, మెదక్ జిల్లాలో 562, సిద్దిపేట జిల్లాలో 814 పాఠశాలలను ఎంపిక చేసింది.

–పాపన్నపేట(మెదక్)



- మూడు జిల్లాలకు రూ.82.11 కోట్లు మంజూరు
- ఇప్పటికే 25 శాతం నిధులు జమ

మహిళా సాధికారతతో సర్కారు బడుల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసింది. స్వయం సహాయక గ్రూపు అధ్యక్షులు కమిటీ చైర్‌పర్సన్లుగా, పాఠశాలల హెచ్‌ఎంలు కన్వీనర్లుగా కొనసాగుతారు. వీరి ఆధ్వర్యంలోనే పాఠశాలల పనులు కొనసాగాలి. కనీస సౌకర్యాలు మెరుగు పర్చడం, బాలికల టాయిలెట్లు, తాగునీరు, మైనర్, మేజర్ మరమ్మతులు, టాయిలెట్ల ఆధునీకీకరణ, క్లాస్ రూంల విద్యుద్దీకరణ, పరిసరాల పరిశుభ్రత, సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, యూనిఫాంలు కుట్టడం, పాఠశాల నిర్వహణ లాంటి పనులు చేపట్టాలి.

అప్రమత్తమైన అధికారులు

జూన్ 12న బడులు తెరిచే నాటికి పనులు పూర్తి కావాలని ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సూచించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అన్ని చోట్ల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ బాధ్యులే పనులు చేయాల్సి ఉంది. చైర్‌పర్సన్లు అంతా మహిళలే కావడంతో కొన్ని చోట్ల పనులు సాగడం లేదని తెలుస్తోంది. మొదటగా విడుదలైన 25 శాతం నిధుల నుంచి తాగునీటి సంపులు, టాయిలెట్లు, రన్నింగ్ వాటర్, విద్యుద్దీకరణ తొలి ప్రాధాన్యాంశాలుగా తీసుకున్నారు. సంగారెడ్డి జిల్లాలో 1,297 పాఠశాలలుండగా అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 756, సిద్దిపేట జిల్లాలో మొత్తం 1,018 పాఠశాలలుండగా 814, మెదక్ జిల్లాలో మొత్తం 922 పాఠశాలలుండగా 562 ఎంపిక చేశారు. ఇందులో సిద్దిపేటలో 99 శాతం, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 100 శాతం పనులు ప్రారంభమైనట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లా	ఎంపికైన బడులు
సంగారెడ్డి	756
మెదక్	562
సిద్దిపేట	814

కొనుగోళ్లు వేగిరం చేయండి

కలెక్టర్ క్రాంతి

కొండాపూర్(సంగారెడ్డి): వర్షాకాలం సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయడంతో పాటు కొన్న వడ్లను వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం సంగారెడ్డి డివిజన్ పరిధిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొండాపూర్, గొల్లపల్లి, మల్కాపూర్, తేర్పోల్‌లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిల్లుల వద్ద ధాన్యం త్వరగా అన్ లోడ్ చేయించాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. వాతావరణ మార్పులకనుగుణంగా ఉదయమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. రోజూ ఐదు లారీలు కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. చివరిగింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని గన్నీ బ్యాగ్‌ల సమస్యలుంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. సదాశివపేట, కొండాపూర్‌లలో ఉన్న జొన్నల కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతం చేసి, గోదాంలకు తరలించాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులను పాఠశాలలు పునః ప్రారంభం కన్నా ముందే పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. బుధవారం కొండాపూర్ మండలం గొల్లపల్లిలోని జిల్లా పరిషత్ బాలబాలికల ఉన్నత పాఠశాల, మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని విద్యా శాఖ అధికారులను, ఈఈపీఆర్ ఇంజినీర్లను ఆదేశించారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

సంగారెడ్డి టౌన్: జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి అన్నారు. బుధవారం పట్టణంలోని పీఎస్‌ఆర్ గార్డెన్లో ఓట్ల లెక్కింపు అంశంపై ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ లో సూపర్‌వైజర్లు 153, సహాయకులు 173 మంది మొత్తం 326 మంది శిక్షణ తీసుకున్నట్లు వెల్లడించారు.

సిమ్లా విహార యాత్రలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రజాప్రతినిధులు, అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పోలింగ్ కూడా ఈనెల 13న పూర్తయ్యింది. ఎన్నికల మూడ్ నుంచి బయటపడేందుకు విదేశాలకు, దేశంలోని చూడదగిన ప్రాంతాలకు వెళ్తున్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సిమ్లాలో పర్యటిస్తున్నారు. ఇక్కడ రాష్ట్రపతి నివాస్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీ భవనం, క్రీస్తు చర్చి, సెయింట్ మైకేల్ క్యాథెడ్రల్ చర్చిలను సందర్శించారు. ఎమ్మెల్యే వెంట సుధాకర్‌రెడ్డి, నరసింహగౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.



సిమ్లాలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నాయకులు

నంబర్ ప్లేట్స్ లేని వాహనాలపై కొరడా



వాహనాలను తనఖీలు చేస్తున్న సీఐ రవి, సిబ్బంది

- స్పెషల్ డ్రైవ్‌లో 28 వాహనాలు సీజ్
- 130 వెహికిల్స్‌కు రూ.39 వేల జరిమానా

జహీరాబాద్ టౌన్: ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు పట్టణంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంతో పాటు పస్తాపూర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నంబర్ ప్లేట్ లేని 28 వెహికల్స్ సీజ్ చేశారు. 130 వాహనాలకు రూ.39,105 వేల జరిమానా విధించామని జహీరాబాద్ టౌన్ సీఐ రాజబొయిన రవి తెలిపారు. సీజ్ చేసిన వాహనాల పత్రాలను పరిశీలిస్తున్నామన్నారు. వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్, డాక్యుమెంట్స్... వెహికల్ వెంట పెట్టుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలివ్వరాదని ఇస్తే తల్లిదండ్రులపై 304 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్ చేయరాదన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను రోడ్లపై వస్తే సీజ్ చేస్తామన్నారు. హెల్మెట్ ధరించి ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. రోడ్లపై అడ్డగోలుగా ఆటోలు పార్కింగ్ చేయరాదని చెప్పారు. వాహనదారులకు నెల రోజులు గడువు ఇస్తున్నామన్నారు. ఆలోపు అన్ని పత్రాలు సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. తనిఖీల్లో జహీరాబాద్ ఎస్ఐ.లక్ష్మారెడ్డి, చిరాగ్‌పల్లి ఎస్ఐ. నరేష్ పోలీసులు పాల్గొన్నారు.

సరిహద్దు ఆర్టీఏ చెక్‌పోస్టుల ఎత్తివేత?

- త్వరలో మూసివేసేందుకు ప్రభుత్వం పరిశీలన
- ఇప్పటికే పలు రాష్ట్రాల్లో మూసివేత
- ఇక ఆన్‌లైన్‌లోనే అనుమతులు
- తీరనున్న వాహన యజమానుల ఇబ్బందులు

జహీరాబాద్: సరిహద్దుల్లో ఇక ఆర్టీఏ చెక్‌పోస్టులు ఇక ఉండవని తెలుస్తోంది. ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. కేంద్ర ప్రభుత్వం గత రాష్ట్ర సర్కారు దృష్టికి తీసుకొచ్చినా సానుకూలంగా లేకపోవడంతో ఆగిపోయింది. ఇప్పుడు మరోసారి తెర పైకి వచ్చింది.

లోక్‌సభ పరిధిలోని రాష్ట్ర సరిహద్దులో ఉన్న జహీరాబాద్, కామారెడ్డి, మద్నూర్ రవాణా శాఖ చెక్‌పోస్టులను ఎత్తివేసే దిశలో ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఆర్టీఏ సరిహద్దు చెక్‌పోస్టులను ఎత్తివేశారు. రాష్ట్రంలోనూ చెక్‌పోస్టుల ఎత్తివేతకు అప్పుడు బీఆర్‌ఎస్ సానుకూలంగా లేదు దీంతో ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పై విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 15 చెక్‌పోస్టులను మూసివేసే విషయాన్ని సర్కారు పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీంతో జహీరాబాద్ సమీపంలోని మాడ్గి గ్రామ శివారులో 65వ జాతీయ రహదారిపై ఉన్న చెక్‌పోస్టుతో పాటు కామారెడ్డి, మద్నూర్ చెక్‌పోస్టులు మూతపడనున్నాయి. దేశ వ్యాప్తంగా జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత రవాణా పర్మిట్లు, ఇతర అనుమతులన్నీ ఆన్‌లైన్‌లోనే లభిస్తున్నాయి. దీంతో అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న రవాణా శాఖ చెక్‌పోస్టులు అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం 2021 సంవత్సరంలో ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సరిహద్దు చెక్‌పోస్టులను ఇప్పటికే తీసివేశారు. మిగతా రాష్ట్రాల్లో చెక్‌పోస్టుల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. అందులో భాగంగానే రాష్ట్రంలో కూడా చెక్‌పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. చెక్‌పోస్టులను తొలగించడం వల్ల లారీ యజమానులు, ఇతర వాహనాల యజమానులకు ఊరట లభించనుంది. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వచ్చే వాహనాలు, వాటి పర్మిట్లు చెక్‌పోస్టుల్లో తనిఖీ చేయించుకోవాలి. పర్మిట్లతో పాటు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ వాహనం చెక్‌పోస్టు దాటాలన్నా ఎంతో కొంత ముట్టజెప్పుకోక తప్పదనే అభిప్రాయాలను వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం చెక్‌పోస్టులను మూసివేసే విషయంలో ఒక నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెక్‌పోస్టులను మూసివేసే విషయంలో సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. చెక్‌పోస్టుల్లో పనిచేసే సిబ్బందిని ఇతర శాఖలకు మార్చడం ద్వారా ఆయా శాఖల్లో కొంత మేర సిబ్బంది కొరత కూడా తీరనుంది. చెక్‌పోస్టులను మూసివేయడం వల్ల జాతీయ రహదారిపై కొంత మేర ట్రాఫిక్ సమస్య కూడా తీరుతుందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.



రాష్ట్ర సరిహద్దులో ఉన్న రవాణా శాఖ చెక్‌పోస్టు

పచ్చదనం పరిచేద్దాం



పచ్చదనం, ప్రకృతి సోయగాలంటే అందరికీ ఇష్టమే. పార్కులు.. ఇతర ప్రాంతాల్లో పచ్చదనం, పర్యావరణ హితం కోసం ఏర్పాటు చేసిన చెట్ల వల్ల కలిగే ఆహ్లాదకరమైన వాతావరణానికి మైమరిచిపోతుంటాం. కొంత సేపు తనువు, మనసు ప్రశాంతంగా ఉంటాం. ఇదే వాతావరణం మన చుట్టుపక్కలా.. మన ఇంట్లో ఉంటే ఎంత బాగుంటుందో ఒక్కసారి ఆలోచించండి.. ఆ మేరకు ప్రభుత్వం వచ్చే నెలలో పదో విడత హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది.

పదో విడత హరితహారానికి ఏర్పాట్లు

- మొక్కలు సిద్ధం
- జిల్లాలో 20 లక్షలు నాటడమే లక్ష్యం

రాయికోడ్(అందోల్): వచ్చే నెలలో పదో విడత హరితహారం కార్యక్రమం కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 20 లక్షల మొక్కలను నాటించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 647 పంచాయతీలుండగా 639 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీలు ఏర్పాటు చేశారు. పంచాయతీ సొంత నిధులతో ఎనిమిదింటిని సైతం ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో 3 వేల మొక్కలు గతంలో పెంచినవే ఉన్నాయి. కొత్తగా మరో 3 వేల మొక్కలను పెంచారు. అంటే ఒక్కో నర్సరీలో 6 వేల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే వివిధ మండలాల్లో ఉపాధి హామీ కూలీలతో 7 వేల గుంతలను తీయించారు. ఇంటింటికి 6 మొక్కల పంపిణీ చేస్తారు. ఒక్కో పంచాయతీ పరిధిలో విధిగా 2,700 ల మొక్కలను నాటించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

అందుబాటులో పలు రకాల మొక్కలు

హరితహారం కోసం ఏర్పాటు చేసిన నర్సరీల్లో మునగ, రావి, గంగరావి, నిమ్మ, జామ, చింత, బొప్పాయి, వేప, గానుగ, ఉసిరి తదితర రకాల మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉంచారు. ఇంటి పరిసరాల్లో నాటే మొక్కలను పోషకులు కోరిన రకం అందిస్తారు. లక్ష్యం మేర మొక్కలు నాటి సంరక్షిస్తూ గ్రామాల్లో పచ్చదనం మరింత పెరిగి వాతావరణ సమతుల్యత మెరుగుపడనుందని అధికారులు అభిప్రాయపడ్డారు.


ఒక్కో మొక్కకు ఖర్చు ఇలా..

హరితహారం కోసం ప్రభుత్వం రూ.21 కోట్ల నిధులను వెచ్చించింది. నర్సరీలో ఒక్కో మొక్క పెంచేందుకు రూ.27, మొక్క నాటేందుకు అవసరమయ్యే గుంతను తీసేందుకు రూ.27, మొక్క నాటేందుకు రూ.4, నాటిన మొక్కను పోషణకు రూ.5 చెల్లించనున్నారు. నాటిన ప్రతి మొక్క చెట్టుగా ఎదిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఉపాధి సిబ్బందికి సూచనలు చేశారు.



కుసునూర్‌లో గుంతలు తీస్తున్న కూలీలు

సకాలంలో గుంతలు సిద్ధం



వచ్చేనెల మొదటి లేదా రెండో వారంలో పదో విడత హరితహారం ప్రారంభిస్తాం. ఆలోగా గుంతలు తీసే పనులు పూర్తి చేసేందుకు ఆదేశాలిచ్చాం. జిల్లాలో 38 లక్షల మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయి. 20 లక్షల మొక్కలను నాటించి పోషించేలా లక్ష్యం పెట్టుకున్నాం. నాటిన ప్రతి మొక్క పెరిగేలా ప్రణాళిక వేశాం. పాడైన మొక్కల స్థానంలో మరో మొక్క నాటి పోషించాలని సిబ్బందికి సూచించాం. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పోషణ అలవాటుగా మార్చుకోవాలి. హరితహారంతో వాతావరణ సమతుల్యత సాధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

– మణికుమార్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్

క్లుప్తంగా

పెట్రోల్ బంకులో మోసం

లీటర్‌కు 50 ఎమ్ఎల్ తక్కువ



ఆందోళన చేస్తున్న వాహనదారులు

శివ్వంపేట(నర్సాపూర్): బంకులో వాహనదారులకు తక్కువ పెట్రోల్ పోస్తూ మోసం చేస్తున్న ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రమైన శివ్వంపేటలో ఉన్న భారత్ పెట్రోల్ బంకులో ఓ వినియోగదారుడు లీటర్ పెట్రోల్ కొనుగోలు చేస్తే 50 ఎంఎల్ తక్కువ వచ్చింది. ఈ విషయంలో బంకు నిర్వాహకులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వాహనదారులు ఆందోళన చేశారు. కొలతల్లో మోసానికి పాల్పడుతున్న బంకు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు బంకు వద్దకు చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పి బంకును తాత్కాలికంగా మూసివేశారు.

సారవంతమైన భూమిలోనే అధిక దిగుబడులు



సూచనలు చేస్తున్న రాజ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): సారవంతమైన భూమిలోనే అధిక దిగుబడులు వస్తాయని, రైతులందరూ పొలాల్లో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని అధిక దిగుబడులు పొందాలని మన గ్రోమోర్ సెంటర్ జోనల్ మార్కెటింగ్ మేనేజర్ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు సంబంధించి మట్టి నమూనాలను పరీక్షించి నివేదికలు అందించారు. కార్యక్రమంలో మేనేజర్లు సురేశ్, జానకయ్య, చేర్యాల మేనేజర్ మధుసూదన్, ఫీల్డ్ ఆఫీసర్ మురళీ, నాగరాజు, రైతులు తిరుపతిరెడ్డి, కిషన్, భాస్కర్, రాజశేఖర్, మహేందర్, నరేశ్, ఇమామ్, కొమరయ్య, యాదయ్య, సంపత్, ప్రశాంత్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు చేర్చండి

అదనపు కలెక్టర్ మాధురి

కంది(సంగారెడ్డి): రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు చేర్చి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని అదనపు కలెక్టర్ మాధురి అధికారులకు సూచించారు. బుధవారం కందిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రోజూ కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని లారీల్లో మిల్లులకు పంపాలన్నారు. ధాన్యం తీసుకొచ్చేందుకు అవసరమైన గోనే సంచులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే వర్షంలో ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లను కేంద్రంలో అందుబాటులో ఉంచాలన్నారు. పీఏసీఎస్‌లో ఇప్పటి వరకు 421 మంది రైతుల నుంచి 4,016 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశామని సీఈఓ శ్రీధర్ రెడ్డి తెలిపారు. మిల్లుల వద్ద లారీలు త్వరగా ఖాళీ కాక పోవడంతో ధాన్యం నిలిచి పోతుందని వివరించారు. లారీలు త్వరగా ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వ్యక్తి మృతిపై అనుమానాలు

పోలీసులను ఆశ్రయించిన బాధిత కుటుంబ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): పద్నాలుగు రోజుల కిందట మృతి చెందిన వ్యక్తిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి పోతులబోగూడ గ్రామానికి చెందిన కొనేటి పోచయ్య(60) ఈ నెల 8న గ్రామ శివారులోని నీటి గుంటలో పడి మృతిచెందాడు. సహజ మరణంగా భావించి అంత్యక్రియలు జరిపించారు. పోచయ్యకు సమీప బంధువైన ఇదే గ్రామానికి చెందిన నర్సమ్మ భూమి అమ్మకానికి పెట్టారు. పలువురు రియల్ వ్యాపారులు తక్కువ ధరకు ఆమె నుంచి భూమి కొనుగోలు చేస్తున్నారని పోచయ్య అడ్డుపడ్డాడు. దీంతో పోచయ్యను అడ్డు తొలగించుకోవాలని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు హత్యచేసి నీటి కుంటలో పడేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సమ్మర్ క్యాంప్.. ఫుల్ జోష్

వేసవి కాలం వచ్చిందంటే బీహెచ్ఈఎల్ టౌన్ షిప్‌లోని క్రీడా మైదానాలు చిన్నారులతో కళకళలాడుతున్నాయి. 45 ఏళ్లుగా భెల్ కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో ప్రతీఏటా వివిధ క్రీడల్లో చిన్నారులకు సమ్మర్ క్యాంపు నిర్వహించి మెరుగైన శిక్షణను అందిస్తున్నారు. ఈ క్రీడా మైదానాలతో ఆడిన అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)



డాన్స్ నేర్చుకుంటున్న చిన్నారులు

కళకళలాడుతున్న భెల్ క్రీడా మైదానాలు

- 12 క్రీడల్లో 630 మందికి శిక్షణ
- అంతర్జాతీయ స్థాయిలో రాణింపు
- ఆసక్తి చూపుతున్న చిన్నారులు

బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో సుమారు 45 ఏళ్లుగా కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో చిన్నారులకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఇందులో కార్మికుల పిల్లలతోపాటు బయట వారికి అవకాశం కల్పిస్తున్నారు. ఎక్కడా లేని విధంగా అన్ని క్రీడలకు వేర్వేరుగా క్రీడా మైదానాలు ఉండడంతో ఈ సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ తీసుకునేందుకు చిన్నారుల తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నారు.

35 రోజులు నిర్వహణ

ప్రతీ ఏటా వేసవిలో భెల్ కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో 35 రోజులు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. వాలీబాల్, అథ్లెటిక్, బాస్కెట్ బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, షటిల్, బ్యాడ్మింటన్, టేబులు టెన్నిస్, లాన్ టెన్నిస్, రోలర్ స్కేటింగ్, కర్రసాము, గిటార్, కీబోర్డ్, వోకల్ సింగింగ్, యోగా, చిత్రలేఖనం, స్విమ్మింగ్‌లో ఎంతో నైపుణ్యం కలిగిన కోచ్‌లతో శిక్షణ అందిస్తున్నారు.

630 మందికి శిక్షణ..

35 రోజుల నిర్వహించే ఈ సమ్మర్ క్యాంప్‌లో 630 మంది చిన్నారులు వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో నేర్చుకుంటున్నారు. భెల్ కాలనీలోని సుమారు 10 క్రీడా మైదానాల్లో చిన్నారుల ఆటపాటలతో సందడి వాతావరణం నెలకొంది.



చిత్రలేఖనంలో శిక్షణ పొందుతూ..



బాస్కెట్ బాల్ ఆడుతున్న చిన్నారులు

క్రీడలపై మరింత ఆసక్తి



నా బాల్యంలో ప్రతీ వేసవిలో భెల్ జరిగే సమ్మర్ క్యాంప్‌నకు వెళ్లి వాలీబాల్ ఆడేవాన్ని. ఈ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనడం ద్వారానే క్రీడలపై మరింత ఆసక్తి పెరిగింది. వాలీబాల్ పై ప్రత్యేక దృష్టి సారించాను. సమ్మర్ క్యాంప్‌లే జీవితాన్ని మార్చివేశాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాను. భారత్ బీచ్ వాలీబాల్ కెప్టెన్ అయ్యాన్, క్రీడల్లో రాణించి కస్టమ్స్‌లో ఉద్యోగం సైతం సాధించాను.

– ఎం.కృష్ణంరాజు, భారత్ బీచ్ వాలీబాల్ కెప్టెన్, కస్టమ్స్ అధికారి

భెల్ యాజమాన్యం సహకారంతో..



కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో భెల్ యాజమాన్యం సహకారంతో ప్రతీ వేసవిలో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం ఈ సమ్మర్ క్యాంప్‌లో 630 చిన్నారులు వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నారు. 35 రోజులపాటు ఈ క్యాంప్‌ను నిర్వహించి, ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తాం.

– శ్రీకాంత్ కమ్యూనిటీ సెంటర్, ప్రధాన కార్యదర్శి

స్విమ్మింగ్ నేర్పిస్తున్నా..



భెల్‌లోని సమ్మర్ క్యాంప్‌లో మంచి శిక్షణను అందిస్తున్నారు. మా బాబు భార్గవ్‌కు స్విమ్మింగ్ నేర్పిస్తున్నాను. ప్రస్తుతం స్విమ్మింగ్‌లో నైపుణ్యం సంపాదించాడు. చాలా మంది పిల్లలు ఇక్కడికి వచ్చి నేర్చుకుంటున్నారు.

– నాగరాజు గౌడ్, బీడీఎల్ కాలనీ

జంట హత్యల కలకలం

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ వెంకట్ రెడ్డి
- మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఘటన



మృతదేహాలపై లభించిన ఉంగరాలు, ఇతర వస్తువులు

నర్సాపూర్ రూరల్: మెదక్ జిల్లా నర్సాపూర్ రాయరావు చెరువు కట్ట కింద గుర్తు తెలియని జంట హత్యలు బుధవారం కలకలం సృష్టించాయి. నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎస్సై పుష్పరాజు కథనం మేరకు. నర్సాపూర్ రాయరావు చెరువు కట్ట కింద చెట్ల పొదల్లో గుర్తు తెలియని ఓ మహిళ, పురుషుడి మృతదేహాలు ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా ఇద్దరి మృతదేహాలపై బట్టలు లేకుండా కుళ్లిపోయి ఉన్నాయి. వీరి వయస్సు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. ఇద్దరినీ ఎక్కడైనా హత్య చేసి ఇక్కడికి తీసుకొచ్చి వేశారా.. ఘటనా స్థలంలోనే హత్య చేశారా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి సైతం సందర్శించారు. ఎక్కడైనా అదృశ్యమైన వ్యక్తుల వివరాలు ఉంటే నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి ఫోన్ 87126 57940, ఎస్సై పుష్ప రాజ్ 87126 57941కి సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకొని ఘటనా స్థలంలోని మృతదేహాల పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేసినట్లు పోలీసులు తెలిపారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో మోసం

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వద్ద రూ.4.40 లక్షలు
- కిరాణా షాపు వ్యాపారి వద్ద రూ. 4.67 లక్షలు కాజేసిన వైనం

పటాన్ చెరు టౌన్: పార్ట్ టైమ్ జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.4.40 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని వందనపురి కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైమ్ జాబ్ అంటూ వాట్సాప్‌కు ఏప్రిల్ 16న మెసేజ్ వచ్చింది. ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.4.40 లక్షలు చెల్లించాడు. చివరిగా ఉద్యోగి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో కిరాణా షాప్ వ్యాపారి..

అమీన్‌పూర్ పరిధిలోని నరేందర్ నగర్ కాలనీకి చెందిన ఓ కిరాణా షాప్ వ్యాపారికి మే 6వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేశాడు. మొత్తం రూ.4.67 లక్షలు పెట్టుబడి పెట్టాడు. చివరికి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి బుధవారం అమీన్‌పూర్ పోలీసుల ఫిర్యాదు చేశాడు.

కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్య



పావని (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తి పంచాయతీ పరిధి శేరీల గ్రామంలో చోటు చేసుకుంది. మృతురాలి తండ్రి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొడె యాదమ్మ, శ్రీనివాస్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. ఆరు నెలల కిందట పొలం అమ్మగా వచ్చిన డబ్బులతో రెండో కూతురు వివాహం జరిపించారు. పెళ్లి ఖర్చులు పోగా మిగిలిన రూ.4 లక్షలు విషయంలో శ్రీనివాస్ రెండవ సోదరి మంజుల, తల్లి బాలమణి వేధింపులకు పాల్పడ్డారు. మిగిలిన డబ్బులు మూడవ కూతురు పావని(18) కోసమని దాచి ఉంచగా, వాటిని ఇవ్వాలని మూడు రోజుల కిందట ఇంట్లో గొడవ జరిగింది. అప్పటి నుంచి మనస్తాపంతో ఉంటున్న పావని అత్తమ్మ, నానమ్మ వేధింపులు తాళలేక బుధవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురి మృతికి కారణమైన సోదరి మంజుల, తల్లిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

41 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో సీఐ శ్రీను, సిబ్బంది

చేర్యాల(సిద్దిపేట): అక్రమంగా రవాణ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ ఎల్.శ్రీను తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కొమురవెల్లి పోలీస్ స్టేషన్, చేర్యాల మండల పరిధిలోని పెద్దరాజుపేట గ్రామ శివారులో నూనె వెంకటేశ్ మంగళవారం రాత్రి డీసీఎంలో ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడని సమాచారం వచ్చిందన్నారు. సిబ్బందితో వెళ్లి 41 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. కొమురవెల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసిన, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లి..

చెరువులో మునిగి విద్యార్థి మృతి



శివకుమార్ (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): చెరువులో మునిగి విద్యార్థి మృతి చెందిన ఘటన జిన్నారం మండలంలోని వావిలాలలో చోటు చేసుకుంది. జిన్నారం ఎస్ఐ విజయారావు కథనం మేరకు.. బాలాగర్‌లో నివాసం ఉంటున్న అవుసలి శివకుమార్(20) డిగ్రీ చదువుతున్నాడు. ఈనెల 20న ఏడుపాయలలో స్నేహితుడి అన్న కుమార్తె వివాహం ఉండటంతో వెళ్లాడు. పెళ్లి ముగిసిన అనంతరం మరుసటి రోజు వావిలాలోని పీర్యా చెరువులో స్నానం చేసేందుకు శివకుమార్‌తోపాటు తోటి స్నేహితులు అక్షయ్, కార్తీక్, గౌతరం, కరణ్‌సింగ్, యశ్వంత్‌లు వెళ్లారు. స్నానం చేస్తున్న సమయంలో శివకుమార్‌కు ఈత రాకపోవడంతో చెరువులో గుంతలో పడిపోయాడు. ఈ విషయాన్ని స్నేహితులు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా, పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం శివకుమార్ మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయారావు తెలిపారు.

ట్రాన్స్ కో.. జర చూస్కో

హరిత సిద్దిపేట కనుమరుగయ్యేలా ఉంది.. హరితహారంలో భాగంగా బల్దియాలో నాటిన మొక్కలు భారీ వృక్షాలుగా మారాయి. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం, సిబ్బంది ముందుచూపు వైఫల్యంతో చెట్లు నేలరాలుతున్నాయి. వర్షాకాలం కారణంగా వైర్ల కింద ఉన్న కొమ్మలను తొలగించాల్సిన విద్యుత్ శాఖ సిబ్బంది ఏకంగా చెట్టును పూర్తి స్థాయిలో నరికివేశారు. దీంతో పట్టణ ప్రధాన వీధుల్లో రెండు రోజులగా నరికిన చెట్టు మొదల్లు దర్శనమిస్తున్నాయి. విద్యుత్ వైర్లకు తాకే అవకాశం ఉన్న చెట్టు కొమ్మలను మాత్రం నరికితే చాలని, ఇలా ఏకంగా చెట్టు మొదలు వరకు నరకడం ఏమిటని పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

– సిద్దిపేటజోన్





సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొమ్మలను కాకుండా చెట్టును పూర్తి స్థాయిలో నరికిన దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మాడ్గి చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. చిరాగ్ పల్లి ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుడంపల్లి మండలంలోని మాడ్గి గ్రామానికి చెందిన ఉప్పరి నగేశ్ (33) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనుల కోసం మంగళవారం కర్నాటక రాష్ట్రంలోని మన్నెకెల్లికి వెళ్లాడు. పనులు ముగించుకొని రాత్రి స్వగ్రామానికి బయలుదేరాడు. మాడ్గి చౌరస్తాలో బస్సు దిగి రోడ్డు దాటుతుండగా జహీరాబాద్ వైపు నుంచి ముంబాయి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని మరో వ్యక్తి

హవేళిఘణాపూర్(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ మండల పరిధిలోని మంభోజిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వెల్దుర్తి మండలం దామరంచ గ్రామానికి చెందిన శంభు నర్సింలు(24) భార్య మౌనిక, తల్లి ఎల్లమ్మ కలిసి తన కుమార్తె పుట్టు వెంట్రుకల కోసం బైక్‌పై బట్టలు తీసుకునేందుకు మెదక్‌కు వచ్చారు. పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మెదక్ మండలం మంభోజిపల్లి గ్రామం వద్ద ఆగి ఉన్న సిమెంట్ లారీని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో నర్సింలు అక్కడికక్కడే మృతి చెందగా, భార్య మౌనిక, తల్లి ఎల్లమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి తరలించినట్లు ఎఎస్ఐ శివకుమార్ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఇద్దరు మృతి



స్వామి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వర్గల్ మండలం నెంటూరులో చోటు చేసుకుంది. బేగంపేట ఎస్ఐ భువనేశ్వర్ రావు కథనం మేరకు.. నెంటూరుకు చెందిన పూదూరి స్వామి(28)కి భార్య చందన, 9 ఏళ్లలోపు ఇద్దరు పిల్లలు సాక్షిత, మణి ఉన్నారు. కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసైన స్వామి తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం రాత్రి చేపలు పట్టేందుకు గ్రామ సమీప సామల చెరువు వద్దకు వెళ్లాడు. బుధవారం తెల్లవారినా స్వామి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. గ్రామంలోని సామలచెరువు వద్ద బైక్, చెప్పులను గుర్తించారు. చెరువులో వెతకగా స్వామి మృతదేహం లభ్యమైంది. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు తన భర్త చెరువులో మునిగి మృతి చెందినట్లు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేసిన వలె మృత్యుపాశమై..



రాజు(ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): మంజీరా వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి, వేసిన వలలో చిక్కుకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ షేక్ మహబూబ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన తలారి రాజు (44) నిత్యం మంజీరా వాగులో చేపలు పడుతూ కుటుంబాన్ని పోషించేవాడు. రోజూ మాదిరిగానే గ్రామ శివారులో ఉన్న మంజీరా వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. వాగులో చేపల కోసం వలలు వేస్తుండగా ప్రమాదవశాత్తు అదే వల చిక్కుకొని వాగులో పడ్డాడు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న స్థానికులు గమనించి రాజు భార్య లక్ష్మీకి సమాచారం ఇచ్చారు. ఆమె గ్రామస్తుల సహకారంతో వాగులో వెతకగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

27 లోగా బకాయిలు చెల్లింపు

సంగారెడ్డి టౌన్: రైతులు, కార్మికులు, ప్రభుత్వానికి జహీరాబాద్‌లోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం చెల్లించాల్సిన వివిధ బకాయిలు ఈ నెల 27 తేదీలోగా చెల్లించాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశించారు. బుధవారం పరిశ్రమలోని కార్మిక సంఘాల నాయకులు, పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ రామ్‌నాథ్, కలెక్టర్ క్రాంతి, జిల్లా కార్మిక శాఖ అధికారి షుగర్ కేన్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు, యాజమాన్యానికి పలు ఒప్పందాలు కుదిరినట్లు కలెక్టర్ తెలిపారు. ట్రైడెంట్ చక్కెర కర్మాగారం కార్మికులకు వేతన బకాయిలు పీఎఫ్, గ్రాట్యుటీ , ఎల్ఐసీ ప్రీమియం బకాయిలు 27వ తేదీన చెల్లించడానికి అంగీకరించి హామీ పత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్మికులకు మూడు నెలల వేతన బకాయిలు చెల్లిస్తామని చెప్పినట్టు తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఇతర పన్నులు, అన్నీ కలిపి జూలై 1 రోజున చెల్లింపులు చేసి పరిశ్రమ తిరిగి పునః ప్రారంభించడానికి చర్యలు తీసుకోనున్నట్లు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించిందన్నారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ రవీందర్ రెడ్డి, కమిషనర్ రాజశేఖర్, కార్మిక సంఘం నాయకులు శ్రీరాములు, ట్రైడెంట్ చక్కెర పరిశ్రమ కార్మికులు యాజమాన్యం పాల్గొన్నారు.

దినదినగండంగా..

లక్ష మంది బీడీ కార్మికుల బతుకులు

- మూతపడే దిశగా పరిశ్రమ
- దుర్భర పరిస్థితుల్లో కుటుంబాలు
- ప్రభుత్వం ఉపాధి కల్పించాలని వినతి

సిద్దిపేట జిల్లాలో వ్యవసాయం తర్వాత ప్రధానంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు బీడీ పరిశ్రమే ఏళ్లుగా అండగా ఉంది. దుబ్బాక, సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లోని ప్రతీ గ్రామంలో వందలాది కుటుంబాలు ఆధారపడి లక్షకు పైగా కార్మికులు ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమలు క్రమంగా పనిని తగ్గిస్తుండటంతో ఎలాంటి ఉపాధి లేక పేద కుటుంబాలు దినదినగండంగా కాలం గడుపుతున్నాయి.

– దుబ్బాక



దుబ్బాకలో బీడీలు చుడుతున్న కార్మికులు

బీడీ పరిశ్రమపై ఆధారపడి లక్షకు పైగా కార్మికులు జీవనం గడుపుతున్నారు. సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలు ఈ పరిశ్రమకు పుట్టినిల్లు. కొన్నేళ్లుగా పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల క్యాన్సర్ సోకుతుందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగగా కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. బీడీ కట్టలపై పుర్రె గుర్తులు, 85 శాతానికి పైగా డేంజర్ బొమ్మలు ముద్రించాలని యాజమాన్యాలకు ఆంక్షల విధించింది. బీడీలు తాగొద్దని పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో పరిశ్రమ క్రమంగా సంక్షోభంలోకి కూరుకుపోయింది.

పింఛన్ల కోసం ఎదురుచూపు

జిల్లాలో లక్షకు పైగా బీడీ కార్మికులుండగా వీరిలో పాత పీఎఫ్ ఉన్న కార్మికులను గుర్తించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరేళ్లపాటు ఆసరా పింఛన్లు అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా యథావిధిగా నెలకు రూ.2,016 పింఛన్‌ను ఇస్తుంది. జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం పీఎఫ్ ఉన్న 47,464 మంది కార్మికులకు ఆసరా పింఛన్ నెలకు రూ.2,016 చొప్పున అందిస్తున్నారు. కొత్తగా పీఎఫ్‌లు వచ్చిన వారు ఇంకా సుమారుగా 30 వేల వరకు ఉంటారు. వీరికి కూడా పింఛన్లు అందిస్తామని గత ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇంతవరకు అమలు కాలేదు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా అందిస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



జిల్లాలో లక్షకు పైగా బీడీ పరిశ్రమను నమ్ముకున్న కుటుంబాల పరిస్థితి చాలా దారుణంగా తయారైంది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కార్మికులను ఆదుకోవాలి. దినదినగండంగా కార్మికుల కుటుంబాలు బతుకు వెళ్లదీస్తున్నాయి. ప్రభుత్వం ఈ కుటుంబాలకు అండగా నిలవాలి.

–తుమ్మ శంకర్, తెలంగాణ ఆల్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

20 ఏళ్లుగా బీడీలు చుడుతున్నా..



నేను 20 ఏళ్లకు పై నుంచి బీడీలు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. నాకు బీడీలు తప్ప వేరే పనిరాదు. ఇప్పుడు బీడీలు బంద్ అయితే చాలా ఇబ్బంది అవుతుంది. కార్ఖానాలు బంద్ అయితే మా లాంటి గరీబోళ్ల బతుకులు ఆగం అవుతాయి. ప్రభుత్వం బీడీ కార్మికులను ఆదుకోవాలి.

–జరీన, బీడీ కార్మికురాలు